పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

మణికొండ: సాంఘిక సంక్షేమ శాఖ నార్సింగి గురుకుల కళాశాలలో 2017వ సంవత్సరం నుంచి చదువుకుని ఎలాంటి ఉద్యోగం పొందలేని వారికి అదే కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. 19–25 సంవత్సరాల వయసు ఉన్న పూర్వ విద్యార్థులకు జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన వృత్తి నైపుణ్య మెళకువలను ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. అర్హత ఉన్న వారు కళాశాలలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ఫోన్ 95504 43854లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉద్యమ నేత భాగ్యరెడ్డికి నివాళి

బండ్లగూడ: తెలంగాణ ఉద్యమ నేత, దళిత చైతన్యానికి వేగుచుక్క మదరి భాగ్యరెడ్డి జయంతిని గురువారం నిర్వహించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా కమిషనర్ బి.శరత్‌చంద్ర హాజరయ్యారు. మేనేజర్ ఇ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సత్యనారాయణ


నివాళులర్పిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికుల హక్కుల కోసం పోరాడిన పర్స సత్యనారాయణ సేవలు ఎంతో గొప్పవని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బచ్చలకూర స్వామి అధ్యక్షతన పర్స సత్యనారాయణ వర్ధంతిని కాటేదాన్ చౌరస్తాలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేతలు శాంతికిరణ్, ఎం.డి.ఫయాజ్, అజయ్, చెన్నయ్య, ప్రవీణ్, సచిన్, శ్రీనివాస్, టి.వెంకటేష్‌గౌడ్, శశికాంత్, దత్తు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షలు పలికిన లక్కీ నెంబర్లు


మణికొండ: రంగారెడ్డి జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల లక్కీ నెంబర్ల వేలం పాటలో అవి రూ. లక్షలు పలికాయి. గురువారం మణికొండలోని కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో టీజీ 07ఏఏ 9999 నెంబర్ రూ. 15 లక్షల 1999లు పలికింది. పోఫస్ ఇన్ఫ్రా సంస్థ దాన్ని దక్కించుకుందని అధికారులు తెలిపారు. టీజీ 07ఏబీ 0009 నెంబర్ రూ. 8.10 లక్షలకు ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ సంస్థ దక్కించుకుంది. లక్కీ నెంబర్ వేలం పాటలో ఒక్క రోజులోనే రూ. 46,01,235ల ఆదాయం వచ్చిందని అధికారులు వివరించారు.

వివాహిత అదృశ్యం


సుజాత

శంషాబాద్ రూరల్: సోదరుడి ఇంటికి వచ్చిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఫరూఖ్‌నగర్ మండలం చిలకమర్రి గ్రామానికి చెందిన పెంటని సుజత(35) ఈ నెల 14న శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని గొల్లపల్లిలో ఉన్న తన సోదరుడు భాస్కర్ ఇంటికి వచ్చింది. రెండు రోజుల తర్వాత సుజత తిరిగి స్వగ్రామానికి వెళ్లకపోవడంతో.. భర్త నర్సింహాలు ఆమె సోదరుడుకి ఫోన్ చేసి మాట్లాడాడు. సుజాత గొల్లపల్లి నుంచి 15న ఉదయం వెళ్లిపోయిందని చెప్పాడు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


సులేమాన్ (ఫైల్)

అత్తాపూర్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నౌ నెంబర్ ప్రాంతానికి చెందిన సులేమాన్(28) ఆటో డ్రైవర్. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్ అధ్యక్షతన దుర్గా కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, యువజన కాంగ్రెస్ ఎన్‌ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు అందరూ సమన్వయంతో ప్రతి కార్యకర్తకూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ యాస, భాషను వాడుకుంటూ పది సంవత్సరాల పాటు రాష్ట్ర సంపదను దోచుకుతిన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గారడీ మాటలు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు ఇచ్చిన మాటలను విస్మరిస్తూ వెళ్లారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి పది సంవత్సరాల పాటు రాజ్యం ఏలిన విషయం ఈ సందర్భంగా చెప్పారు.
- కోట్లాది రూపాయల సంపదను ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు బినామీలు పేరుతో వందల ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫామ్ హౌస్‌లను నిర్మించుకున్నారన్నారు. వారు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తూ ప్రజా పాలనలో సాక్ష్యాధారాలతో ప్రజలకు వివరిస్తుంటే వారి బండారం ఎక్కడ బయట పడుతుందోనని బీఆర్‌ఎస్ నేతల్లో వణుకుపుడుతోందన్నారు.
- బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుకు తగిన విధంగా జవాబులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉన్న కార్పొరేటర్ స్థానాలను గ్రామీణ ప్రాంతంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్‌పీటీసీలను గెలిపించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.
- సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, సామ ఇంద్రపాల్‌రెడ్డి, హైదర్షాకోట్ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, కాశీగారి యాదగిరి, ఛత్రపతి, వినోద్‌గౌడ్, మదూరి ప్రభాకర్‌రెడ్డి, పడమటి శ్రీధర్‌రెడ్డి, సదాలక్ష్మీ, బండ చంద్రారెడ్డి, వెంకటేష్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ యాదవ్, గంగయ్య ముదిరాజ్, అడికే అర్జున్, రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, అశోక్‌యాదవ్, బండ చంద్రారెడ్డి, శంషాబాద్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు


అత్తాపూర్: బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల వైపు దృష్టిసారించేలా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధాయ్యులపై ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్ రాథోడ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సమగ్ర శిశు ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఇన్ సర్వీసింగ్ ప్రోగ్రామ్ అత్తాపూర్‌లో ఉన్న ఎడిఫై ఇంటర్నేషనల్ పాఠశాలలో మూడవ రోజు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సెకండరీ గ్రేడ్ టీచర్లకు అవగాహన కల్పించారు. పాఠ్య పుస్తకాలలో ఉన్న పాఠ్యాంశాలను నేరుగా చెప్పకుండా టీఎల్‌ఎం పద్ధతుల్లో బోధిస్తే ప్రైమరీ విద్యార్థులకు త్వరగా అర్థం అవుతుందన్నారు. ప్రకృతిలో ఉన్న వృక్ష సంపద వ్యవసాయ సంపద, పశు సంపద చెరువులు, కుంటలు ప్రత్యేకంగా కనిపించే వాటిని ఉదహరిస్తూ బోధన చేస్తే విద్యార్థులకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుందన్నారు. వివిధ పాఠశాలలో విద్యార్థులకు తమ పద్ధతులు చేప్పే విధానాలను ఒకరిని ఒకరు చెప్పిన విధానం విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రోహిణి, అనిల్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం


మైలార్‌దేవ్‌పల్లి: సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి చొరవ చూపించకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అంతాఇంతా కావని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆరోపించారు. శుభోదయం కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలో గురువారం పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, ఆప్కో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదన్నారు. వీరందరికి ఒక్కటే శ్మశానవాటిక ఉందన్నారు. ఎవరైనా చనిపోతే కనీసం కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు లేని పరిస్థితి, బిందెల్లో నీళ్లు తెచ్చుకొని స్నానాలు చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. ఈ శ్మశానవాటికలో ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. నేతలు ఎన్.రాముయాదవ్, రాజేష్‌యాదవ్, సూర్యం, చిరంజీవి, జగదీష్, అరుణ్‌ముదిరాజ్, సురేష్‌ముదిరాజ్, జి.రాజు, అశోక్‌కుమార్, వెంకటరమణ, ఉప్పల్ శ్రీను, భగవాన్‌దాస్, భాస్కర్, ఈశ్వర్, వెంకటేష్, కార్తీక్, మల్లేష్‌ముదిరాజ్, భూదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... అత్తాపూర్ తేజస్వీనగర్ కాలనీకి చెందిన గోపాల్ పంచల(51) ప్రైవేట్ ఉద్యోగి. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న గోపాల్

రహదారి పనులు ప్రారంభం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ కుమార్

శంషాబాద్: అధ్వానంగా తయారైన శంషాబాద్ పట్టణంలోని గొల్లపల్లి పాత రహదారి పునర్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మైనార్టీ ఫంక్షన్ హాలు వరకు నిర్మించే రోడ్డు పనులను ఆరో వార్డు మాజీ కౌన్సిలర్ వై.కుమార్ పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆరో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన ముగ్గురు లబ్ధిదారులకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

బండ్లగూడ: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 7వ డివిజన్‌లోని పద్మశ్రీ కాలనీలో పిల్లల పార్కు, బి–బ్లాక్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ దగ్గర స్వీపింగ్ పనులను పరిశీలించారు. అలాగే 6వ డివిజన్‌లోని సీ–బ్లాక్ కాలనీ మార్కెట్‌లో స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దు అన్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు సాంసన్, లక్ష్మీనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

బండ్లగూడ: అమృత్ మిత్ర ప్రభుత్వ కార్యక్రమలో భాగంగా ఉమెన్ ఫోర్ ట్రీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 13వ డివిజన్‌లోని ఫెబల్ సిటీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పాల్గన్నారు. ఈ సందర్భంగా వివిధ మహిళా సంఘల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మహిళల ద్వారా మొక్కలు నాటడం, సంరక్షణ అవశ్యకత గురించి వివరించారు. పచ్చదనాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై ఫిర్యాదులపై టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోలో శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బి.కృష్ణారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులు, ఆర్టీసీ ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలు, కొత్త రూట్‌లలో బస్సులు, సమయపాలన తదితర వాటిపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, సలహాలను ఫోన్: 99592 26135లో తెలియజేయాలన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు చెక్

అత్తాపూర్: చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విస్తృత స్థాయిలో ఫైర్ మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తున్నారు. చిన్న నిర్లక్ష్యం ఎంత ప్రమాదానికి దారి తీస్తుందో ప్రజలకు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అధికారులు అత్తాపూర్ డివిజన్‌లోని లక్ష్మీరాం హరన్ అపార్ట్‌మెంట్‌లో గురువారం ఫైర్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అధికారులు శ్రీనివాస్, చంద్రనాయక్‌లు ఇతర సిబ్బందితో కలిసి పెద్ద ఎత్తున మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో మహిళలు, పిల్లలు, పెద్దలు అన్ని ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలని విషయంపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ప్రజల అవగాహనతో అప్రమత్తంగా ఉండటం వల్ల ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చు అని రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ వెల్లడించారు. ప్రజలలో అవగాహన పెంచడానికి అగ్నిమాపక శాఖ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని సామాజిక కార్యకర్త, లక్ష్మీరాం హరన్ అసోసియేషన్ ప్రతినిధి మధుసూదన్ అన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గురుకులాల ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర

శంషాబాద్: రాష్ట్రంలో పన్నెండు ఇంటర్మీడియట్ గురుకుల కళాశాలలను ఎత్తివేయడానికి రాష్ట్ర సర్కారు కుట్ర చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ ఆరోపించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద వర్గాలను ప్రభుత్వ విద్యను దూరం చేయడంలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు చేపడుతోందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వంగా కళాశాలల ఎత్తివేతకు సిద్ధమైందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ బారీ ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు అనిల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్షియర్లమంటూ బైక్ యజమానిపై దాడి

అత్తాపూర్: అక్రమంగా బైక్‌ను ఆపించి బైక్ ఫైనాన్స్ వారమని చెప్పి బెదిరించడంతో పాటు దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 20వ తేదీన టీఎస్12ఈవై7948 బైక్‌ను బాధితుడు ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వైపు తీసుకువస్తున్నాడు. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 161 వద్ద కాళా హనుమాన్ ఆలయం ప్రాంతంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అతడిని ఆపి బైక్‌పై ఫైనాన్స్ రూ. 60 వేలు ఉందని రూ. 8 వేలు ఇస్తే బైక్ ఇస్తామని బెదిరించారు. అనుమానం వచ్చిన బాధితుడు ఐడీ కార్డు అడగగా వారు అతడిపై దాడి చేశారు. అనంతరం అతడిని బెదిరించి రూ. 2500 బలవంతంగా లాక్కొని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను ఆధునికీకరించాలి


ఎండీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల అవసరాల నిమిత్తం డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను ఆధునికీకరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–11 సంబంధించిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ సెక్షన్, మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్ అత్తాపూర్ డివిజన్ సంబంధించిన పలు ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మరికొన్ని చోట్ల దెబ్బతినడంతో డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆయా సమస్యలపై గురువారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించామరు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రత్యేక చొరవ తీసుకొని పనులు మంజూరు చేయాలని ఎండీని కోరామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పనులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మొండ్ర కొమురయ్య, జయానంద్‌రెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా హనుమాన్ జయంతి


మణికొండలో పూజల్లో పాల్గొన్న బీజేపీ నేతలు


నార్సింగిలో పూజల్లో పాల్గొన్న భక్తులు


చింతల్‌మెట్‌లోని హనుమాన్ ఆలయంలో...

మణికొండ: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని హనుమాన్ దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠనం, అర్చనలు, భజనలు, అన్న ప్రసాద వితరణలు చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... హిందువులు వారితో పాటు వారి పిల్లలను వారంలో మంగళ, శనివారాల్లో తప్పనిసరి హనుమాన్ దేవాలయానికి తీసుకొచ్చి మన సంస్కృతిని వివరించాలని సూచించారు. హిందువుల సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పూజల్లో బీజేపీ నాయకులు బి.రవికాంత్‌రెడ్డి, సి.బీరప్ప, కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

చింతల్‌మెట్‌లో...

శాస్త్రిపురం: చింతల్‌మెట్ హనుమాన్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం చేసి భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆంజనేయ స్వామి మాల ధరించిన భక్తులు రామ నామ జపం చేస్తూ ఆలయంలో ప్రదక్షిణలు చేయడం కనిపించింది. దేవాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తును నిర్వహించారు.